క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తాడికొండ: విద్యుత్ మరమ్మతులలో భాగంగా ఆదివారం సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈఈ రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పలు గ్రామాలలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంట్ ఉండదని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు నిడమర్రులో ఉచిత వైద్య శిబిరం

మంగళగిరి: నగర పరిధిలోని నిడమర్రులో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మానవ సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వంగర సురేష్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించే వైద్య శిబిరంలో అన్ని రకాల వ్యాధులకు నిపుణులైన వైద్యులతో పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేయడం జరుగుతుందన్నారు.

'నిర్మల'లో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు



మంగళగిరి: నగర పరిధిలోని ఆత్మకూరు జాతీయ రహదారి వెంట ఉన్న నిర్మల ఫార్మసీ కళాశాలలో శనివారం ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ సిస్టర్ నిర్మల జ్యోతి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. నూతనంగా చేరిన విద్యార్థులతో స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి. పాములరెడ్డి పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ పరిశీలించిన ఆర్డీఓ



ఫిరంగిపురం: మండలంలోని రేపూడిలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో గోడౌన్‌లో భద్రపర్చిన ఈవీఎంలను ఆర్డీఓ శ్రీకర్ శనివారం పరిశీలించారు. గోడౌన్‌కు కాపాలాగా ఉన్న సిబ్బంది వివరాలు నమోదు, గోడౌన్‌కు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరు పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ పద్మనాభుడు ఉన్నారు.

జాతీయ యువజన ఉత్సవాల్లో కేఎల్‌యూ విద్యార్థులు



తాడేపల్లిరూరల్: వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీకి చెందిన విద్యార్థులు జాతీయ యువజన ఉత్సవాల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రతినిధులుగా పాల్గొన్నట్లు వర్సిటీ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం శనివారం తెలిపారు. జాతీయ సమైక్యత, మానసిక ఉల్లాసం, వ్యక్తిత్వ వికాసానికి దోహదపడే జాతీయ యువజనోత్సవాల్లో ఈ సంవత్సరం తమ వర్సిటీ చెందిన విద్యార్థులు హాజరు కావడంపై హర్షం వ్యక్తం చేశారు. బీసీఏ విద్యార్థిని అనులేఖన, ఐశ్వర్య పాల్గొన్నట్లు చెప్పారు.

కంతేరు పాఠశాల తనిఖీ



కంతేరు(తాడికొండ): మండలంలోని కంతేరు జెడ్పీ ఉన్నత పాఠశాలను గుంటూరు డివిజన్ ఉప విద్యాశాఖాధికారి పి.వెంకటేశ్వరరావు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల్లోని బోధనా నైపుణ్యాలను పరిశీలించారు. సీబీఏ- 2 పరీక్షలు, విద్యార్థుల వర్క్ బుక్‌లు పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

నేడు పసుపు రైతుల సదస్సు

తాడేపల్లిరూరల్: పసుపు రైతుల సదస్సు ఆదివారం నిర్వహించనున్నట్లు రైతు సంఘం మండల అధ్యక్షుడు ఎస్.యోగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక పసుపు వ్యాపారుల అసోసియేషన్ హాల్ సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇటీవల దుగ్గిరాలలోని శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్ అగ్నిప్రమాదం చోటుచేసుకోగా, రైతులు నిల్వ చేసుకున్న పసుపు సుమారు 1 లక్షా 20 వేల బస్తాలు కాలిపోయినట్లు చెప్పారు. ఈ పరిస్థితుల్లో రైతాంగానికి మనోధైర్యం కల్పించి, పంట నష్టపోయిన బాధిత రైతులకు ఇన్సూరెన్స్ నష్టపరిహారం కోరుతూ ప్రభుత్వంపై వత్తిడి తెచ్చేందుకు సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

పేదలకు ఆర్థిక భరోసా ఘనత వైఎస్ జగన్‌దే

ఎమ్మెల్సీ మురుగుడు, గంజి చిరంజీవి



సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు, పార్టీ మంగళగిరి సమన్వయకర్త గంజి చిరంజీవి, ఎంపీపీ, జెడ్పీటీసీ, డ్వాక్రా మహిళలు

తాడేపల్లిరూరల్: బడుగు బలహీన వర్గాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి పేర్కొన్నారు. దుగ్గిరాల మార్కెట్‌యార్డులో వైఎస్సార్ ఆసరా కింద అక్కా చెల్లెమ్మలకు శనివారం చెక్కుల పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ నవరత్నాలు వెలుగులు ప్రతి పల్లెలో కనిపిస్తున్నాయని చెప్పారు. దుగ్గిరాల మండలంలోని 18 గ్రామాల్లో 1305 డ్వాక్రా గ్రూపులకు ఆసరా కింద 13,050 మందికి ఒక్కొక్క విడతకు 14 కోట్ల 31 లక్షలు ప్రభుత్వం అందించిందని వివరించారు. ఇంతే కాకుండా చేయూతతో పాటు ఇతర సంక్షేమ పథకాలను మహిళలకు అందించి వారి కుటుంబాలు ఆర్థికంగా ఎదిగే విధంగా ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన దగ్గర నుండి రాష్ట్రంలో ఉన్న పేద ప్రజలను ఆదుకోవడంతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కుటుంబాలను ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగే విధంగా రాజకీయ భాగస్వామ్యం కల్పించినట్లు పేర్కొన్నారు.

31న బీసీ సాధికార బస్సుయాత్ర..

బీసీ సాధికార బస్సు యాత్ర జనవరి 31వ తేదీన మంగళగిరి నిర్వహించనున్నట్లు ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి పేర్కొన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి రాజకీయంగా, ఆర్థికంగా వెనకబడిన వారికి ప్రాధాన్యం కల్పిస్తూ పరిపాలనలో అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. యాత్రను ప్రతి ఒక్కరూ జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. తొలుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ డి.సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు ఎం.అరుణ, ఎంపీఈఓ డి.వీరయ్య, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజీ, వైఎస్సార్ సీపీ ఉపాధ్యక్షులు వి.రజనీకాంత్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు డి.వెంకటేశ్వరరావు, ఏపీఎం మహాలక్ష్మి, సర్పంచులు పి.మేరమ్మ, షేక్ అజీజూన్, ఈ.రమేష్, వైఎస్సార్ సీపీ నాయకులు పి.శామ్యూల్, షేక్ జానీ బాషా, ఎండీ బాజీ, టి.తాతారావు, జి.రమేష్, టి.వెంకట్రావు, షేక్ కరీముల్లా, షేక్ అజీద్, ఎ.నాగేశ్వరరావు, శశి పాల్గొన్నారు.



మహిళలకు నమూనా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు, గంజి చిరంజీవి



ఆసరా కార్యక్రమంలో పాల్గొన్న డ్వాక్రా మహిళలు

సంక్షేమ పథకాలే పార్టీని గెలిపిస్తాయి

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త గంజి చిరంజీవి

మంగళగిరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అందించిన నవరత్నాలు, సంక్షేమ పథకాలే 2024లో మళ్లీ వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకొస్తాయి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి పేర్కొన్నారు. 'గుడ్ మార్నింగ్ మంగళగిరి'లో భాగంగా శనివారం పట్టణంలోని 1,2 వార్డులలో పర్యటించారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ విద్య, వైద్య రంగాలలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందని చెప్పారు. ప్రజలకు సంక్షేమ పథకాలను అందించడంలో దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. విద్యారంగంలో అమ్మఒడి, జగనన్న గోరుముద్ద, విద్యాకానుక, విద్యా వసతి లాంటి పథకాలతో పేద పిల్లలు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు పడకుండా ఉన్నత చదువులు చదువుతున్నారని చెప్పారు. ప్రభుత్వ సహకారంతో విద్యనభ్యసించిన విద్యార్థులతో పాటు ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ మళ్లీ సీఎంగా వైఎస్ జగన్ చేసుకుంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ మునగాల భాగ్యలక్ష్మి, పార్టీ నాయకులు మునగాల మల్లేశ్వరరావు, మల్లవరపు సుధారాణి, తోట శ్రీను, గుంటి రాజ్యలక్ష్మి, నిర్మల, బేతపూడి నరసయ్య, లేళ్లసురేష్, తోట సాంబ, చింకా మహేష్, యర్రాకుల సురేష్ పాల్గొన్నారు.



వృద్ధురాలిని పలకరిస్తున్న వైఎస్సార్ సీపీ సమన్వయకర్త గంజి చిరంజీవి

ప్రజల ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యం

తాడేపల్లిరూరల్: ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరిరక్షణ ప్రభుత్వ లక్ష్యం అని దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి అన్నారు. దుగ్గిరాల పీహెచ్‌సీ డాక్టర్ మహమ్మద్ అబ్దుల్ రహమాన్ ఆధ్వర్యంలో చిలువూరులో జగనన్న ఆరోగ్య సురక్ష – 2 కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. తొలుత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. వైద్యశాలలను కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా తీర్చిదిద్దినట్లు వివరించారు. ప్రతి గ్రామంలో ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలనే సంకల్పంతో ప్రభుత్వ వైద్య బృందాన్ని ఇంటికి పంపి వైద్యసేవల అందిస్తున్నట్లు వివరించారు. ప్రస్తుతం మెరుగైన వైద్యం అందించడానికి జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో రెండు విడతలుగా నిపుణులతో వైద్యపరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందజేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో వైద్యులు ఇందిర, వీవీ కర్ణ, మొహమ్మద్ అతియా, చంద్రశేఖరరావు, ఎంపీడీఓ దేవరపల్లి వీరయ్య, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు డి.వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షులు వి.రజనీకాంత్, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి, కుర్రా సీతారామయ్య, కాల్వ మోహనరావు పాల్గొన్నారు.



వైద్యులతో మాట్లాడుతున్న దుగ్గిరాల ఎంపీపీ సంతోష రూపవాణి తదితరులు

రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత



వాక్‌థాన్‌లో పాల్గొన్న డీటీసీ కరీం, డీఎస్పీ బాలసుందరరావు తదితరులు

డీటీసీ షేక్ కరీం

పట్నంబజారు: రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతని డీటీసీ షేక్ కరీం, ట్రాఫిక్ డీఎస్పీ ఎం. బాలసుందరరావు చెప్పారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా శనివారం పోలీస్ పేరేడ్ గ్రౌండ్స్ నుంచి మూడు బొమ్మల సెంటర్ వరకు వాక్‌థాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీసీ షేక్ కరీం మాట్లాడుతూ కారు డ్రైవింగ్ చేసే ప్రతి ఒక్కరూ సీటు బెల్టు పెట్టుకోవటంతో పాటు, పూర్తిస్థాయి నిబంధనలు పాటించాలని సూచించారు. వాహనంతో రోడ్డుపైకి వచ్చే ప్రతి ఒక్కరూ కచ్చితంగా సంబంధిత ధ్రువీకరణ పత్రాలు వారి వద్ద ఉంచుకోవాలని తెలిపారు. ట్రాఫిక్ డీఎస్పీ ఎం. బాలసుందరరావు మాట్లాడుతూ రోడ్డు భద్రత నిబంధనలు పాటించకపోతే ప్రమాదాలకు ఆస్కారం ఇచ్చిన వారమవుతామని చెప్పారు. అనంతరం విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. విద్యార్థులు, ఆటోడ్రైవర్లు, పోలీసు సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆర్టీఏ అధికారులు జి. గోపాల్, టి. రాఘవరావు, మల్లీశ్వరి, సౌజన్య, సంధ్య, మధుసూదనరావు పాల్గొన్నారు.

పెదవడ్లపూడిలో వికసిత్ సంకల్ప యాత్ర



మంగళగిరి: నగర పరిధిలోని పెదవడ్లపూడిలో శనివారం బీజేపీ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రధాన మంత్రి ఉజ్వల, ఆవాస్ యోజన, ముద్ర యోజన ప్రజలు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో జాతీయ టుబాకో బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్ కుమార్, పార్టీ నాయకులు ప్రాతూరి నాగభూషణం, అమ్మయ్య చౌదరి, కేసీ రెడ్డి, ఈశ్వర్ నాయుడు, మునగాల నాగేశ్వరరావు, బొక్కా నరసింహారావు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుపై శ్రద్ధ పెట్టాలి

డీఎస్పీ డాక్టర్ గీతాకుమారి



తాడేపల్లిరూరల్: విద్యార్థులు చదువుపై శ్రద్ధ పెట్టాలని, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని డీఎస్పీ డాక్టర్ పి.గీతాకుమారి సూచించారు. దుగ్గిరాలలోని మాంటిస్సోరి విద్యా సంస్థలో సైన్స్ ఎగ్జిబిషన్ శనివారం నిర్వహించారు. గీతా కుమారి మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలని, రోజువారి వ్యాయామం చేయాలని, క్రీడలను ఆడాలని, ఆడపిల్లలు ధైర్యంగా ముందుకువెళ్లాలని వివరించారు. 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధం కావాలని కోరారు. మాంటిస్సోరి పాఠశాల ప్రిన్సిపాల్ జోస్ సెబాస్టియన్ మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ జె.సుబ్బారావు, దోస్త్ అధ్యక్షుడు మిక్కిలినేని గాంధీ పాల్గొన్నారు.

లబ్ధిదారుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు

ఫిరంగిపురం: పేదలకు మంజూరు చేసిన ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ కోసం లబ్ధిదారుల వివరాలు ఆన్‌లైన్ చేస్తున్నట్లు తహసీల్దార్ పద్మనాభుడు శనివారం తెలిపారు. మండలంలోని 18 గ్రామాల్లో 1377 మంది పేదలకు ఇంటి స్థలాలు ప్రభుత్వ అధికారులు పట్టాలు అందజేసినట్లు చెప్పారు. లబ్ధిదారులకు పూర్తి హక్కులు కల్పిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారికిచ్చిన స్థలాలకు రిజిస్ట్రేషన్ ఉచితంగా చేసేందుకు సన్నద్ధం చేసినట్లు పేర్కొన్నారు. దానిలో భాగంగా ఆయా గ్రామాల వీఆర్వో(ఎగ్జిక్యూటివ్), గ్రామకార్యదర్శి (జాయింట్ సబ్‌రిజిస్టర్)గా ఉండి వారికి రిజిస్ట్రేషన్ సదుపాయం కల్పిస్తున్నారని చెప్పారు. ఇళ్ల స్థలాల లబ్ధిదారులను వారి పేరు మీద రిజిస్ట్రేషన్ చేసి తరువాత ఈకేవైసీ చేస్తారని తెలిపారు. ఈనెల 27 నుంచి ఫిబ్రవరి 9 వరకు ఈ ప్రక్రియ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆయా గ్రామాల్లోని లబ్ధిదారులు పూర్తి వివరాలు, ఫోన్ నంబర్లను తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందితో ఆన్‌లైన్ నమోదు చేస్తున్నామని తెలిపారు. ఆయన వెంట సీనియర్ అసిస్టెంట్ షేక్, అబ్దుల్ రెహమాన్, కంప్యూటర్ ఆపరేటర్ భాస్కరరెడ్డి ఉన్నారు.



ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేస్తున్న తీరు పరిశీలిస్తున్న తహసీల్దార్ పద్మనాభుడు

ఉపాధ్యాయులే సమాజ మార్గ నిర్దేశకులు



పురస్కారాలు పొందిన ఉపాధ్యాయులతో ఎమ్మెల్సీ లక్ష్మణరావు, కన్న మాస్టారు, పార్వతి, డొక్కా మాణిక్య వరప్రసాద్, వెంకటేశ్వరరావు

ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులే సమాజ మార్గ నిర్దేశకులని ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు పేర్కొన్నారు. కేవీఆర్ అండ్ జయలక్ష్మి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ సోషల్ సైన్సెస్ ఉపాధ్యాయుల ప్రతిభా పురస్కార మహోత్సవాన్ని శనివారం మార్కెట్ సెంటర్లోని శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించారు. కన్న విద్యాసంస్థల డైరెక్టర్ కన్న మాస్టారు అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యార్థుల్ని సామాజిక అవగాహనతో పాటు బాధ్యతతో కూడిన పౌరులుగా తీర్చిదిద్దడంలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు విశేష కృషి చేస్తున్నారని తెలిపారు. గత నాలుగు దశాబ్దాలుగా విద్యా బోధనలో వచ్చిన సమూల మార్పుల కారణంగా విలువల స్థానంలో ఉపాధికి ప్రాధాన్యత నిచ్చే సైన్స్ అండ్ టెక్నాలజీలకు డిమాండ్ పెరిగిందన్నారు. ప్రప్రథమంగా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల్ని గౌరవించి సత్కరించే అవకాశం కేవీఆర్ అండ్ జయలక్ష్మి ఎడ్యుకేషన్ ట్రస్టుకు దక్కడం గర్వకారణమని తెలిపారు. విశిష్ట అతిథులుగా పాల్గొన్న మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు కేవీఆర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ చేస్తున్న విద్యా సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా పౌరశాస్త్ర అధ్యాపకుడు నూతలపాటి వీరప్రకాశరావును విశిష్ట ప్రతిభా పురస్కారంతో సత్కరించడంతోపాటు 46 మంది సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల్ని సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ కో-ఆర్డినేషన్ డైరెక్టర్ పి.పార్వతి, వీజీఎస్ పబ్లిషర్స్ అధినేత ఎస్.రామారావు, యూటీఎఫ్ కార్యదర్శి ఎం.కళాధర్, ఎడ్యుకేషనల్ ట్రస్ట్ కార్యదర్శి కె.అలీన్, కె. విజయలక్ష్మి పాల్గొన్నారు.

నాట్కో ట్రస్టు సేవలకు అవార్డు



కలెక్టర్ నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న నాట్కో ట్రస్టు వైస్ చైర్మన్ సదాశివరావు

గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో పేద రోగులకు కార్పొరేట్ వైద్య సేవలు అందేలా కృషి చేస్తున్న నాట్కో ట్రస్టు సేవలకు అవార్డు లభించింది. గణతంత్ర దినోత్సవంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి చేతుల మీదుగా నాట్కో ట్రస్టు వైస్ చైర్మన్ నన్నపనేని సదాశివరావు ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. 2015లో గుంటూరు జీజీహెచ్‌లో ఎలుకల దాడిలో పసికందు మృతి చెందిన సంఘటనపై చలించిపోయి నాట్కో ట్రస్టు చైర్మన్ నన్నపనేని వెంకయ్యచౌదరి జీజీహెచ్‌లో పిల్లల వార్డును రూ. 3కోట్లతో నిర్మించారు. అనంతరం రూ. 2 కోట్లతో వార్డులో వార్మర్లు, ఫొటోథెరఫీ యూనిట్లు, సీ ప్యాప్ మిషన్లు ఏర్పాటు చేశారు. పసికందులకు అత్యవసర వైద్య సేవలు అందించే ఎన్ఐసీయూ, పీఐసీయూ వైద్య విభాగాలను 2017లో రూ. కోటితో ఆధునీకరించారు. న్యూరాలజీ వైద్య విభాగంలో నిద్ర సమస్యలకు చెక్ పెట్టేందుకు అవసరమైన రూ. 25 లక్షల ఖరీదు చేసే స్లీప్ ల్యాబ్ మిషన్‌ను అందజేశారు. నర్సింగ్ విద్యార్థులకు వసతి గృహంలో రూ. కోటితో పలు గదులు, మరుగుదొడ్లు నిర్మాణం చేశారు. ఆర్థోపెడిక్ వైద్య విభాగంలో 2018లో రూ. కోటితో మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్ నిర్మించారు. రాష్ట్రంలోనే మొట్టమొదటి క్యాన్సర్ సెంటర్‌ను నాట్కో ట్రస్టు గుంటూరు జీజీహెచ్‌లో కార్పొరేట్ వైద్య సౌకర్యాలతో రూ. 45 కోట్లతో నిర్మించింది. ప్రతి ఏడాది రూ. 2 కోట్లకు పైగా ఖరీదు చేసే క్యాన్సర్ మందుల్ని రోగులకు ఉచితంగా అందిస్తున్నారు. త్వరలోనే రూ.13 కోట్లతో క్యాన్సర్ చివరి దశలో ఉండే రోగుల కోసం ప్రత్యేకంగా భవనాన్ని నిర్మించేందుకు నాట్కో ట్రస్టు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. 2015 నుంచి నిరంతరం జీజీహెచ్ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్న నాట్కో ట్రస్టు సేవలు వెలకట్టలేనివని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ తెలిపారు.

గుంటూరు కళా పరిషత్ నాటకోత్సవాలు ప్రారంభం

పాత గుంటూరు: రాజాగారితోటలోని శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో గుంటూరు కళాపరిషత్ 26వ వార్షిక నాటక ఉత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రముఖ సాహితీవేత్త బి. వేదయ్య కళావేదికపై నిర్వహించిన నాటికలు ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నాయి. పి.ఎస్. నారాయణ మూల కథ, పరమాత్ముని శివరాం నాటకీకరణ, రమేష్ మంచాల దర్శకత్వంలో కరీంనగర్ చైతన్య కళాభారతి కళాకారులు 'స్వప్నం రాల్చిన అమృతం' సాంఘిక నాటిక ప్రదర్శించారు. కవి పీఎస్ఎం రచన, దర్శకత్వంలో ఇబ్రహీంపట్నం వీటీపీఎస్ కల్చరల్ అసోసియేషన్ కళాకారులు 'ఎనిమీ' సాంఘిక నాటిక ప్రదర్శించారు. కావూరి సత్యనారాయణ రచనకు, ఏపూరి హరిబాబు దర్శకత్వంలో గుంటూరు అమరావతి కల్చరల్ అసోసియేషన్ కళాకారులు 'అమృత హస్తం' సాంఘిక నాటిక ప్రదర్శించి ప్రేక్షకుల ప్రశంసలు పొందారు. అనంతరం జరిగిన సభకు కళా పరిషత్ అధ్యక్షులు పి.వి. మల్లికార్జునరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ వి. రామలింగయ్య, పౌరాణిక రంగస్థల కళాకారులు నలకా శ్రీనివాసరావు, కళాపరిషత్ ప్రధాన కార్యదర్శి బి పూర్ణ, కార్యదర్శులు అమ్మిశెట్టి శివ, గుమ్మడి నాగేశ్వరరావు, సభ్యులు పాల్గొని కళాకారుల్ని సత్కరించారు.

15 ఏళ్ల సమస్యకు ఆపరేషన్‌తో విముక్తి

70 ఏళ్ల వృద్ధుడికి అరుదైన ఆపరేషన్

గుంటూరు మెడికల్: రెండు మోకాళ్లలో తీవ్రమైన నొప్పులతో 15 ఏళ్లుగా బాధపడుతున్న 70 ఏళ్ల వృద్ధుడికి అరుదైన, క్లిష్టమైన ఆపరేషన్ చేసి నొప్పి మాయం చేశామని శ్రీరామచంద్ర జాయింట్ రీ ప్లేస్‌మెంట్ సెంటర్‌కు చెందిన సర్జన్ డాక్టర్ పోట్ల శివయ్య చెప్పారు. స్థానిక డొంక రోడ్డులోని ఆస్పత్రిలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆపరేషన్ వివరాలను ఆయన వెల్లడించారు. బాపట్ల జిల్లా కొలగానివారిపాలేనికి చెందిన 70 ఏళ్ల దాడి వెంకటేశ్వర్లు 15 ఏళ్లుగా రెండు మోకాళ్లలో తీవ్రమైన నొప్పులతో బాధపడుతూ, నడవలేక మంచానికే పరిమితమయినట్లు తెలిపారు. కుడి మోకాలు లోపల 40 డిగ్రీలు, ఎడమ మోకాలు 50 డిగ్రీలు వెలుపలకు వంగిపోయి ఉన్నట్లు వెల్లడించారు. వైద్య పరిభాషలో ఈ వ్యాధిని' విండ్ స్వెప్ట్ డిఫార్మిటీ' అంటారన్నారు. పలువురు వైద్యులను కలిసినా నొప్పి తగ్గక, తమ ఆస్పత్రికి 2023 నవంబర్‌లో వచ్చినట్లు చెప్పారు. పరీక్షలు చేసి, నవంబర్ 27 కుడి మోకీలు మార్పిడి ఆపరేషన్ విజయవంతంగా చేశామన్నారు. మరలా 2024 జనవరి 23న అమెరికా నుంచి ప్రత్యేకంగా దిగుమతి చేసుకున్న ఇంప్లాంట్స్‌తో ఎడమ మోకీలుకు సుమారు ఐదు గంటల సేపు ఆపరేషన్ చేసి నొప్పి, ఒంకర, ఇతర సమస్యలు లేకుండా చేశామని వివరించారు. సమస్యలు లేకపోవడంతో శనివారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేసినట్లు వెల్లడించారు.

శరవేగంగా రోడ్డు పనులు



నూతక్కి(మంగళగిరి): నగర పరిధిలోని నూతక్కి ఎస్టీ కాలనీ రోడ్డు పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఇటీవల వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి, పార్టీ మండల కన్వీనర్ మర్రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి నూతక్కిలో పర్యటించిన సందర్భంలో ఎస్టీ కాలనీ వాసులు తమ రోడ్డు సమస్యను వివరించారు. వెంటనే స్పందించిన నాయకులు అధికారులతో మాట్లాడి వెంటనే రోడ్డు పనులు ప్రారంభించాలని సూచించారు. రోడ్డు నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించారు.

ఎంపీడీఓ కార్యాలయం ఎదుట మహిళల నిరసన

ఫిరంగిపురం: తాగునీరు సరఫరా చేయాలని కోరుతూ అల్లంవారిపాలేనికి చెందిన మహిళలు శనివారం నిరసన తెలిపారు. 20 రోజులుగా తాగునీరు సరఫరా చేయడం లేదని ఆరోపించారు. కర్నూలు–గుంటూరు రాష్ట్ర రహదారిపై ధర్నా చేశారు. సాగర్ నీరు వచ్చినా రేపూడి గ్రామంలోని చెరువు నింపకుండా సంబంధిత అధికారులు నిర్లక్ష్యం కారణంగా ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. తహసీల్దార్ పద్మనాభుడు వచ్చి సమస్యను తెలుసుకుని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈతో మాట్లాడారు. సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. అధికారుల హామీతో ఆందోళన విరమించారు.

మత్తు పదార్థాల దుర్వినియోగంపై అవగాహన

తాడేపల్లిరూరల్: మత్తు పదార్థాలు తీసుకోవడం వలన ఆరోగ్యం క్షీణించడంతో పాటు, ఆర్థికంగా నష్టపోతామని నవజీవన్ బాలభవన్ ప్రోగ్రామ్ మేనేజర్ జి.శేఖర్‌బాబు అన్నారు. శనివారం ఎంటీఎంసీ పరిధిలోని డాన్ బాస్కో సలేసియన్ యూత్ మెంబర్స్‌కు మత్తుపదార్థాల దుర్వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మత్తు పదార్థాల దుర్వినియోగంపై స్క్రీన్ ప్రొజెక్టర్ ద్వారా వారికి వివరించారు. కార్యక్రమంలో ఫాదర్ వై.జోజి, నవజీవన్ బాలభవన్ జోనల్ కో ఆర్డినేటర్స్ బి.రమేష్, డాన్ బాస్కో సలేసియన్ యూత్ మెంబర్లు పాల్గొన్నారు.